క్లుప్తంగా

కనకదుర్గమ్మకు కిరీటం సమర్పణ


అమ్మవారికి అలంకరించిన ఇత్తడి కిరీటం

రంగంపేట: చంద్రేడులో కొలువైన శ్రీదేవి కనకదుర్గమ్మకు గ్రామానికి చెందిన నక్కా మల్లేష్, దుర్గాదేవి దంపతులు శుక్రవారం ఇత్తడి కిరీటం సమర్పించారు. ఈ కిరీటానికి అర్చకుడు మైలవరపు కృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి అలంకరించారు.

రాట ముహూర్తం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని మెయిన్ రోడ్డు వద్ద గల సంతోషిమాత ఆలయంలో దేవీ నవరాత్ర ఉత్సవాలకు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. బొడ్డు ముత్యాలరావు, గంగాభవాని దంపతులు కర్తలుగా వ్యవహరించనున్నారు. దసరా ఉత్సవాలలో ప్రతి రోజూ కుంకుమార్చన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి, బండారు అప్పారావు, తుమ్మూరి వెంకట రమణ, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

శ్రీకృష్ణపట్నంలో వైద్యశిబిరం


శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ మృదుల

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నంలో వేద ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ మృదుల ఆధ్వర్యంలో శుక్రవారం స్త్రీల కోసం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మృదుల మాట్లాడుతూ మహిళలు రక్తహీనత లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కణతులు, గడ్డలు ఉంటే వెంటనే మహిళా డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ కమిడి శ్రీరామ్ ఈ శిబిరం నిర్వహణకు సహకారం అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంక్షన్.. టెన్షన్..


రాజానగరం ఏడీబీ రోడ్డు జంక్షన్‌లో వాహనాల అవస్థలు

రాజానగరం: గ్రామంలోని ఏడీబీ రోడ్డు జంక్షన్ ఇప్పటికే గోతులతో అధ్వానంగా మారింది. రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి ముంపునకు గురైంది. గోతుల్లో నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. గోతుల్లోకి నీరు చేరడంతో కారు, వ్యాన్లు టైర్లు దిగిపోయాయి. గతంలో ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా మేజర్ డ్రైనేజీలు ఉండేవి. వాటిలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వైపు ఉన్న డ్రైనేజీ ఆక్రమణలతో పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ముంపు నీరు బయటకు పోయే మార్గం లేక రోడ్డుపై తిష్ట వేస్తోంది.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ

కంబాలచెరువు: అనధికారికంగా బాణాసంచా తయారీ, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డి.నరసింహ కిషోర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే నిబంధలనకు లోబడి బాణసంచా తయారీ, విక్రయాలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి జన సంచార స్థలాల్లో, అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్నా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా 112కి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి మహిళ కళాశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ మహిళా చట్టాలు, రాజ్యాంగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక హక్కులను కాపాడుకోవడంతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అప్పుడే దేశం ప్రగతి బాటలో నడుస్తుందని తెలిపారు. సమయం చాలా విలువైనదని, దాన్ని సద్వినియోగం చేసుకున్నవారు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. సదస్సులో విశ్రాంత జడ్జి శ్రీనివాస్, ప్యానల్ అడ్వకేట్ దేవీ భవాని, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అడుగడుగునా కష్టాలు..

- రాజానగరంలో ఇళ్ల లబ్ధిదారుల అవస్థలు
- విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు


రాజానగరంలో నిలిచిపోయిన పేదల ఇంటి నిర్మాణ పనులు


మోటారు సాయంతో పనులు పూర్తి చేసుకుంటున్న లబ్ధిదారుడు

రాజానగరం: అర్హులందరికీ పథకాలు, కులమత పార్టీ భేదాలు లేకుండా అందరికీ లబ్ధి, పారదర్శకంగా ఎంపిక అనే నినాదంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలన సాగించారు. పేదలందరికీ పార్టీలకు అతీతంగా లబ్ధి చేకూర్చారు. తన పార్టీకి చెందని వారికి కూడా పథకాలు అందజేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్ని పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది. రాజానగరంలో గృహనిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల కష్టాలు చూస్తే ఇది నిజమేననిపిస్తోంది.

రాజానగరంలో..

నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలోని అనపర్తి రోడ్డును ఆనుకుని సాయిబాబా గుడికి సమీపంలో ఉన్న స్థలంలో 435 మందికి గత ప్రభుత్వం నివాస స్థలాలను పంపిణీ చేసింది. ఆ స్థలాలలో ఎన్నికలకు ముందు 40 మంది వరకు లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టారు. ఇంటి నిర్మాణానికి నీటి సరఫరా ఎంత ముఖ్యమో అందరికీ తెలిసిందే. నీటి కోసం లబ్ధిదారులు తమ స్థలాలో బోర్లు వేయించుకుని, ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. అయితే వారికి వ్యక్తిగతంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో తమ పేరున విద్యుత్ మీటర్లు వచ్చే వరకు దగ్గర్లో ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి అనధికారికంగా విద్యుత్‌ని వాడుకుంటూ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా కొన్ని నిర్మాణాలు శ్లాబ్ లెవిల్‌ను దాటి, ప్లాస్టింగుల వరకూ వచ్చాయి. ఈ సమయంలో అధికారంలోకి వచ్చిన కూటమిలోని స్థానిక నాయకులు గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, స్థానిక నేతల కారణంగా ఎదుర్కొన్న కొన్ని రకాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఆ కోపాన్ని తీర్చుకునే ఆసన్నమైందనుకున్నారు. అనుకోవడమే అదనుగా పేదలు తమ ఇంటి నిర్మాణాలకు వాడుకుంటున్న అనధికార విద్యుత్ కనెక్షన్లను కట్ చేయించారు. దీంతో పేదల గృహ నిర్మాణాలు ఆగిపోయాయి.

ఇంకా అద్దె ఇళ్లలోనే..

ఈ పరిస్థితులలో ఇంటి నిర్మాణాలు దాదాపుగా పూర్తికావొచ్చిన కొందరు మిగిలిన పనులను మోటార్ల సాయంతో పూర్తి చేయించుకుంటున్నారు. ఇలా మోటార్లు పెట్టి పనులు పూర్తి చేసుకుని, మంచి ముహూర్తాలలో గృహ ప్రవేశాలు కూడా చేశారు. కానీ వీరికి వ్యక్తిగత మీటర్లు మంజూరు చేయలేదు. దీంతో ఆ గృహాలలో ఉండేందుకు వీలు లేకుండా పోయింది. ఇల్లు కట్టుకున్నప్పటికీ అద్దె ఇళ్లలోనే కాలం వెల్లదీస్తున్నారు.

ప్రయోజనం శూన్యం

సాధారణంగా ప్రజాప్రతినిధులు ఎన్నికల వరకే పార్టీలు, ఆపై అందరూ తమకు సమానమే అంటారు, కానీ రాజానగరంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో ఇళ్లు కట్టుకుంటున్నారు కాబట్టి, ఇళ్ల లబ్ధిదారులందరికీ పరాయి వాళ్ల భావిస్తున్నట్టు తెలుస్తోంది. విద్యుత్ మంజూరు విషయంపై స్థానిక ఎమ్మెల్యేను లబ్ధిదారులు కలుసుకుని తమ గోడు చెప్పుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. మీ ఇళ్ల నిర్మాణాలను ఆపించేశానంటూ రాజానగరంలో బీజేపీ నాయకుడెవరో తప్పుడు ప్రచారం చేస్తున్నాడనట, ముందు ఆ విషయం తేల్చుకురండి అంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడంతో లబ్ధిదారులు వెనుదిరిగారు. దీంతో ముందుకు సాగని ఇళ్లను చూస్తూ లబ్ధిదారులు కుమిలిపోతున్నారు.

విద్యుత్ అందించాలి



రాజానగరంలో పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా విద్యుత్ సరఫరా చేయాలి. అస్తవ్యస్తంగా ఉన్న తీగలను సరిచేసి, వ్యక్తిగత కనెక్షన్లు మంజూరు చేయాలి. రోడ్డు ప్రక్కన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని బడ్డీలు, పాకలు వేసుకున్న విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. అలాంటిది ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకుంటున్నట్టు వారికి ఎందుకు ఇవ్వరు. ఇప్పటికైనా స్పందించకుపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతాను.

– ముప్పిడి శ్రీను, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సూర్యారావుపేట

వ్యక్తిగత కనెక్షన్లు ఇవ్వాలి



విద్యుత్ మీటర్ల కోసం ఆ శాఖకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ వ్యక్తిగత కనెక్షన్లు మంజూరు చేయాలి. అయితే ఇక్కడ కూడా అధికార పార్టీ పెద్దలు ఆ శాఖ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్టున్నారు. అందుకనే పూర్తయిన ఇళ్లకు కూడా విద్యుత్ సరఫరా లేకుండా పోయింది. విద్యుత్ కనెక్షన్ల కోసం ఎవరు దరఖాస్తు చేసుకున్నా పంచాయతీ పరంగా మేము అభ్యంతరం చెప్పడం లేదు.

– కుందేటి ప్రసాద్, సర్పంచ్, రాజానగరం

సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్



మధురపూడి: కోరుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా బీవీవీఎస్‌వీ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు కార్యాలయంలోని సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌గా పద్మావతి, జూనియర్ అసిస్టెంట్‌గా గణేష్ బదిలీపై వచ్చారు.

బస్టాండ్‌లో పశువుల సంచారం


కోరుకొండ బస్టాండ్‌లో ఆవులు

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ బస్టాండ్ పశువులకు నిలయంగా మారింది. వర్షం కురిస్తే చాలు రోడ్డు మీద తిరిగే ఆవులన్నీ బస్టాండ్‌కు చేరుతున్నాయి. ప్రయాణికులు వేచి ఉండాల్సి చోట తిష్ట వేస్తున్నాయి. వాటికి భయపడి ప్రయాణికులే దూరంగా ఉంటున్నారు. ఆవుల కారణంగా బస్టాండ్ అపరిశుభ్రంగా తయారవుతోంది. ఎక్కడపడితే అక్కడ పేడ వేసేయడంతో దుర్వాసన వెళువడుతోంది. బస్టాండ్ పరిశుభ్రత, ఇతర సంరక్షణ నిమిత్తం ఇక్కడ ఎవ్వరినీ నియమించకపోవడంతో అపరిశుభ్రత నెలకొంటోంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సంపర విద్యార్థులతో హెచ్ఎం తదితరులు


శహపురం విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదపూడి: సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఆర్.త్రిమూర్తులు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ నెల 26న కాకినాడ క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలో రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్-14 హ్యాండ్‌బాల్ విభాగంలో మొకమాటి అజ్య, అండర్-17 విభాగంలో సలాది దివ్యదుర్గ, అలాగే స్విమ్మింగ్ అండర్ - 17 విభాగంలో పిల్ల లక్ష్మణస్వామి, యెరుబండి రాము ఎంపికయ్యారన్నారు. వీరందరూ గుంటూరు, పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మట్టా రామ అయ్యన్న, సర్పంచ్ అద్దంకి మాచరమ్మ, విద్యా కమిటీ చైర్మన్ జి.రామకృష్ణ తదితరులు అభినందించారు.

శహపురం విద్యార్థుల ప్రతిభ

శహపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్టు హెచ్ఎం ఎం.రవి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ నెల 26న కాకినాడలో డీఎస్ఏ గ్రౌండ్‌లో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో వాసంశెట్టి తేజశ్రీదుర్గ, కొప్పిశెట్టి మణి, కాకరపల్లి చైత్ర నందిత, బాలుర విభాగంలో రాయుడు వరప్రసాద్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు గుంటూరు జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

- అండర్ - 17 బాలికల విభాగంలో వాసంశెట్టి శశిదేవి, వల్లు శృతి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఎన్టీఆర్ జిల్లా జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. = అండర్-17 బాలుర విభాగంలో ఎంపికైన నక్కా కూర్మ వెంకట సాయికృష్ణ వచ్చే నెల 7న రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీ ఎస్.హరిరాజు, పాఠశాల ఎస్ఎంసీ చైర్ పర్సన్ వై.లక్ష్మీదుర్గ, గ్రామ సర్పంచి వి.శాంతకుమారి, ఉప సర్పంచ్ కొండేపూడి సూర్యనారాయణ తదితరులు వారిని అభినందించారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి


కొంకుదురులో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: దేశ స్వాతంత్ర్యం కోసం, సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలనకు మహానుభావుల చేసిన త్యాగాలు మరువలేనివని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. భగత్ సింగ్ జయంతి, రాజా రామ్మోహన్‌రాయ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పాఠశాలలో వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ తన ప్రాణాలను అర్పించాడన్నారు. 18వ శతాబ్దం ప్రారంభంలోనే రాజా రామ్మోహన్‌రాయ్ మూఢనమ్మకాలపై పోరాటం చేశారని, మహిళల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఉపాధ్యాయులు మేడపాటి లక్ష్మణరెడ్డి, పడాల ఈశ్వరరెడ్డి, వలీషా, సుధాకరరెడ్డి, సత్యనారాయణ చౌదరి, శిరీష పాల్గొన్నారు.

రైతులకు అన్ని విధాలుగా సహకారం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

మధురపూడి: రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించడమే లక్ష్యంగా పీఏసీఎస్‌లు పనిచేస్తున్నాయని అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి యు.శ్రీలక్ష్మి అన్నారు. కోరుకొండ పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు రుణ సదుపాయం అందించడం, సాగులో సాయం వంటి విషయాలలో సొసైటీలు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయన్నారు. ప్రస్తుతం యూరియా బస్తాను రూ.265 అందిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఈవో ఆకుల వెంకట రమణ మాట్లాడుతూ సంఘం టర్నోవర్ రూ.45.50 కోట్లు ఉన్నట్టు తెలిపారు. రుణాలుగా రూ.44.80 కోట్లు అందించామని, డీసీసీబీ బ్యాంకు నుంచి రుణంగా రూ.38.80 కోట్లు తీసుకున్నామన్నారు.

స్వర్ణాంధ్ర పోటీలలో విద్యార్థుల ప్రతిభ


కోరుకొండ హైస్కూల్లో పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు


రఘుదేవపురంలో విజేతలతో ఎంఈవో స్వామి నాయక్

మధురపూడి: స్వర్ణాంధ్ర ఎట్‌ది రేట్ ఆఫ్ 2047లో భాగంగా కోరుకొండ జెడ్పీ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో మండలానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచనలో గాడాల హైస్కూలుకు చెందిన ఎం.దివ్య, బూరుగుపూడి హైస్కూలు విద్యార్థిని ఎస్‌వీఎస్‌జే వర్ధిని, శ్రీరంగపట్నానికి చెందిన లలితా పావని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వక్తృత్వ పోటీల్లో బూరుగుపూడికి చెందిన పి.దుర్గాసునీత ప్రథమ, శ్రీరంగపట్నానికి చెందిన పి.వెంకటేష్ ద్వితీయ, గాడాలకు చెందిన టి.నాగమణి తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. డిబేటులో కోటికేశవరానికి చెందిన వన్షిత, కోరుకొండకు చెందిన వేణు మాధవి (ప్రథమ), కోరుకొండకు చెందిన కరుణశ్రీ, ఆశా (ద్వితీయ), గాడాలకు చెందిన దివ్య, నాగమణి (తృతీయ) ప్రతిభ చూపారు. వీరంతా ఈ నెల 30 వతేదీన రాజమహేంద్రవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు.

సీతానగరం: స్వర్ణాంధ్ర 2047 నాటికి రాష్ట్రం అభివృద్ధిపై మండల స్థాయి పోటీలను ఎంఈవో కె.స్వామి నాయక్ ఆధ్వర్యంలో రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. వ్యాసరచన, అంశంపై మాట్లాడడం (స్పీచ్), వక్తృత్వ పోటీలు జరిగాయి. వ్యాసరచనలో రఘుదేవపురం హైస్కూల్‌కు పి.లలిత, పి.జాహ్నవి, మిర్తిపాడు హైస్కూల్ విద్యార్థిని లక్ష్మి శిరీష మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అంశంపై మాట్లాడడం (స్పీచ్)పై రఘుదేవపురం హైస్కూల్‌కు చెందిన టి.సాయిసత్య గణేష్, బొబ్బిల్లంకకు చెందిన ఎ.దివ్య, మిర్తిపాడుకు చెందిన వి.మౌనిక ప్రతిభ చూపారు. వక్తృత్వ పోటీలలో పెదవంగలపూడి హైస్కూలు విద్యార్థిని కె.నాగాంజలి, వెదుళ్లపల్లికి చెందిన టి.జాహ్నవీశ్రీ, సీతానగరం హైస్కూల్‌కు చెందిన ఎ.హారిక ప్రతిభ కనబరిచారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


సంపరలో విజయదుర్గమ్మ


రంగంపేటలో కొలువైన విజయ దుర్గాంబిక

పెదపూడి: సంపర గ్రామంలో కొలువైన విజయదుర్గమ్మకు శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. అలాగే వివిధ రకాల పుష్పాలతో చీరలా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు పూజలు చేశారు.

విజయ దుర్గాంబిక ఆలయంలో పూజలు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద కొలువైన విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారు జామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన


సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


సూర్యదేవునికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉష, పద్మిని, ఛాయ, సంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో 12వ సప్తాహ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలతో ఆలయ ప్రదిక్షిణలు గావించి ధ్వజస్తంభం వద్ద హరినామ స్మరణలు మధ్య దీపారాధన చేయించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సప్తాహ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, కమిటీ ప్రతినిధులు బి.ఛత్రపతి శివాజీ, కొవ్వూరు వెంకటరెడ్డి, మేడపాటి సాయిబాబారెడ్డి, మధుప్రసాద్‌రెడ్డి, గుండాబత్తుల శ్రీనివాస్, నల్లమిల్లి అప్పారెడ్డి, నల్లమిల్లి భూలోకరెడ్డి పాల్గొన్నారు.

వరికి ఎండాకు తెగులు బెడద


బ్యాక్టీరియా ఆకుఎండు తెగులు సోకిన వరి పంట


వ్యవసాయాధికారి ఖాసిమ్

రాజానగరం: మండలంలో సాగు చేస్తున్న వరిపంటను అక్కడక్కడా బ్యాక్టీరియా ఆకుఎండు తెగులు ఆశించిందని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ తెలిపారు. ఈ తెగులు ఎక్కువగా ఆర్పీ - బయో, ఎంటీయు 1318, స్వర్ణ వరి రకాలకు సోకుతుందన్నారు. నత్రజనిని అధికంగా వాడడం, పొటాష్‌ను అసలు వాడక పోవడం, తెగులు సోకిన పొలాల నుంచి ఆరోగ్యవంతమైన పొలాలకు సాగు నీటి ప్రవహించడం వంటి చర్యల వల్ల ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. ఈ తెగులు సోకిన పంట ఆకు చివర భాగం నుంచి కిందకు ఎండిపోవడం కనిపిస్తే అది బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులుగా నిర్ధారణ చేసుకోవచ్చన్నారు.

నివారణా చర్యలు

- ఈ తెగులు ఆశించిన పొలంలో వెంటనే నత్రజని ఎరువుల వాడకాన్ని నిలిపివేయాలి. వ్యవసాయాధికారులు సిఫారసు చేసిన విధంగా అంకురం దశలో పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరాకు 20 కిలోలు చొప్పున చల్లాలి,
- పొలంలో నిల్వ ఉన్న నీటిని మురుగు నీటి కాలువల్లోకి రెండు, మూడు సార్లు తీసివేయాలి.,
- చివరి ప్రయత్నంగా తెగులు వ్యాప్తిని అరికట్టడానికి ఒక గ్రాము ప్లాంటోమైసిన్, 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 2 కాపర్ హైడ్రాక్సైడ్ 53.8 డీఎఫ్, క్రొసైడ్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

నేడు 'నన్నయ'లో తెలుగు సదస్సు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శనివారం తెలుగు జాతీయ సదస్సు జరగనుంది. తెలుగు విభాగం, ఏపీ స్ఫూర్తి కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో 'గురు విశ్వస్ఫూర్తి రచనలు, ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం' అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

5న మండల పరిషత్ సమావేశం

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అక్టోబర్ 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.వెంకటరత్నం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి వివరాలతో ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.